సంచలన సాయంకాల పత్రిక
సత్యం
https://www.satyamdaily.net/
బుధవారం 18-6-2025
సంపుటి: 21 సంచిక: 73
పేజీలు: 8 వెల: రూ.1



# పునాది వేశా.. ప్రగతి సౌధాలు నిర్మిస్తా!


శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ చెప్పుడుమాటలు వింటారా? ఏడాదిలో కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహిస్తామని మాటిచ్చిన ఆయనకు తత్వం ఎప్పుడు బోధపడింది? గుండ లక్ష్మీదేవిని ఇప్పటికీ చెయ్యి పట్టుకొని తిప్పుతున్న టీడీపీ కేడర్‌పై ఆయన అభిప్రాయం ఏమిటి? ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 57 మంది ఓడిపోతారని ఓ సెఫాలజీ సంస్థ చేపట్టిన సర్వేపై ఆయన అభిప్రాయమేమిటి? స్టేడియం పనులు అర్ధాంతరంగా ఆగిపోడానికి కారణమెవరు? పంచాయతీల విలీనంతో కార్పొరేషన్‌కు లాభం, పంచాయతీలకు నష్టం అంటున్న గొండు శంకర్ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఎన్నిసార్లు కలిశారు? ఇటువంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానం లోపలి పేజీలో..

– పూర్తి ఇంటర్వ్యూ satyam tv srikakulamలో వీక్షించగలరు.












• ఎడిటోరియల్

# ఆ గట్టునుంటావా.. ఈ గట్టుకొస్తావా..?!

ఇరాన్ నుంచి తనకు అణుదాడి ముప్పు ఉందన్న ఆరోపణతో ఆ దేశంపై ఇజ్రాయెల్ ఏకపక్షంగా సైనిక చర్యకు దిగడం పశ్చిమాసియా ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. ఈ వివాదం చిలికిచిలికి గాలివానగా మారి యుద్ధరూపం సంతరించుకుంది. అక్కడితో ఆగకపోగా ప్రపంచ యుద్ధం స్థాయికి చేరుకుంటోంది. అగ్రరాజ్యం అమెరికా ఇప్పటికే ఇజ్రాయెల్‌కు వెన్ను కాస్తుండగా తాజాగా కెనడాలో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా దాని సభ్య దేశాలన్నీ ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించాయి. మరోవైపు 21 అరబ్, ఇస్లామిక్ దేశాల సమాఖ్య ఇరాన్‌కు అండగా నిలిచింది. ఇజ్రాయెల్ దుందుడుకు దాడులను ఖండిస్తూ ఇరాన్‌కు పూర్తి మద్దతు ప్రకటించింది. యుద్ధంలో ఇజ్రాయెల్ తరఫున ఇప్పటికే ఇంగ్లండ్, అమెరికా తమ సైనిక సంపత్తిని ఇరాన్ సరిహద్దులోకి తరలిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇలా ప్రతి దేశం ఏదో ఒక పక్షం వహించి యుద్ధరంగంలోకి దిగుతున్న తరుణంలో భారతదేశం వైఖరి ఎలా ఉంటుంది? ఏ పక్షం వహిస్తుంది?? అన్న సందేహాలు కలగడం సహజం. వాస్తవంగా చెప్పాలంటే భారత్ శాంతికాముక దేశం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ అలీన విధానాన్ని అనుసరిస్తోంది. అంటే ఇతర దేశాల పట్ల స్నేహసంబంధాలు నెరపుతూనే.. యుద్ధం వంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినప్పుడు తటస్థ వైఖరి అవలంభిస్తుంది. ప్రస్తుత ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ పరిస్థితుల్లోనూ ఇరుదేశాలతో సమాన దూరం పాటించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇది అంత ఈజీ కాదని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎందుకంటే.. అటు ఇరాన్‌తో, ఇటు ఇజ్రాయెల్‌తో భారతదేశానికి దశాబ్దాల స్నేహ సంబంధాలతో పాటు ఆర్థిక, వాణిజ్య సంబంధాలు బలంగా కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ కొన్ని దశాబ్దాలుగా భారత్‌కు కీలక రక్షణరంగ భాగస్వామిగా ఉంటోంది. భద్రత, రక్షణ సాంకేతిక పరిజ్ఞానం, ఉగ్రవాద వ్యతిరేక చర్యల నియంత్రణలో సహకారిస్తోంది. 1992 నుంచి ఇరుదేశాలు దౌత్య సంబంధాలు కొనసాగిస్తూ పరస్పర అవగాహనతో పనిచేస్తున్నాయి. 1948లో యూదు రాజ్యం ఏర్పడినప్పటి నుంచీ ఈ బంధం బలపడుతూ వచ్చింది. అదే సమయంలో ఇతర దేశాలతో సంబంధాలపై ఇది ప్రభావం చూపకుండా భారత్ సంయమనం పాటిస్తూ వస్తోంది. మరోవైపు భారత్ తన ముడి చమురు అవసరాలను చాలావరకు ఇరాన్ తీరుస్తోంది. 2018కి ముందు భారత్ తన ముడి చమురు దిగుమతుల్లో పదోవంతును ఇరాన్ నుంచే పొందేది. అయితే గత ఐదేళ్లుగా ఇరాన్‌పై ఆధారపడటం తగ్గించుకుంటోంది. ఇరాన్ చమురు దిగుమతిదారుల్లో చైనా మొదటి స్థానంలో నిలవడమే దీనికి కారణం. ఇరాన్‌తో సంబంధాలను విస్తరించుకోవడం ద్వారా చైనా అనేక వ్యూహాత్మక ప్రయోజనాలు పొందుతోంది. అయినా ఇప్పటికీ ఇరాన్ నుంచి గణనీయంగానే భారత్ చమురు దిగుమతి చేసుకుంటోంది. ఇంకా ఇతర భౌగోళిక, వ్యూహాత్మక అంశాలు కూడా ఇరు దేశాల మధ్య బంధాన్ని పెనవేస్తున్నాయి. మధ్య ఆసియాతో సంబంధాల బలోపేతానికి చాబహార్ ఓడరేవు కీలకం. ఈ ఓడరేవును ప్రస్తుతం ఇండియాయే నిర్వహిస్తోంది. అంతర్జాతీయ ఉత్తర–దక్షిణ కారిడార్ అభివృద్ధిపై కూడా భారత్ దృష్టి సారిస్తోంది. దక్షిణాసియాలో ఇరాన్ ఓ కీలక శక్తి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా రష్యా, చైనా దానికి మిత్రదేశాలుగా కొనసాగుతున్నాయి. భారత్‌కు కూడా ఇరాన్ వ్యూహాత్మక ప్రాధాన్యత ఇస్తోంది. ఇరాన్ నుంచి చమరు దిగుమతులపై అమెరికా విధించిన ఆంక్షలను భారత్ గతంలో సమర్థించింది. ఆ నిర్ణయం కారణంగా పడే ప్రభావం నుంచి బయటపడాలని ఇప్పుడు ప్రయత్నిస్తోంది. దక్షిణాసియాలోని శక్తివంతమైన దేశాలతో సంబంధాలు నెలకొల్పుకొని తన ప్రయోజనాలను విస్తరించుకోవాలని భారత్ కోరుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయిల్ రెండింటికీ భారత్ భౌగోళిక రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక ప్రాధాన్యత ఇస్తోంది. వీటిని దృష్టిలో ఉంచుకునే ఇజ్రాయిల్–ఇరాన్ ఘర్షణల విషయంలో ఆచితూచి అడుగు వేయాల్సి ఉంటుంది. అందుకే దౌత్యపరమైన ప్రతిస్పందన తెలియజేసే విషయంలో మల్లగుల్లాలు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం ఇరాన్–ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న ఘర్షణలను తేలికగా తీసుకోవడానికి వీలు లేదు. ఏమాత్రం మాట జారినా, నిర్ణయం మారినా పరిస్థితి తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. అందుకే ఇటువంటి సందర్భాల్లో భారత్ దౌత్యపరంగా ఒకే మాట చెబుతుంటుంది. ఘర్షణలు, దాడులతో కాకుండా చర్చలతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచిస్తుంది. మరి ఇరాన్, ఇజ్రాయెల్ విషయంలోనూ అదే వైఖరి తీసుకుంటుందని భావించాల్సి ఉంటుంది.


## చెవిరెడ్డి అరెస్ట్ చంద్రబాబు ప్రభుత్వ బరితెగింపు

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)



వైకాపా ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై కుట్రాత్మకంగా రెడ్‌బుక్ ఆధారంగా తప్పుడు కేసు నమోదు చేసి, ప్రజా నేతలను వేధించడమే లక్ష్యంగా కూటమి సర్కార్ అరాచకానికి పాల్పడుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కుట్రలో భాగంగానే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అబద్దపు వాంగ్మూలాలు, తప్పుడు సాక్ష్యాలతో కుట్ర పన్నుతూ చంద్రబాబు ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యాన్ని పాడు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బెంగళూరులోని విమానాశ్రయంలో చెవిరెడ్డిని అదుపులోకి తీసుకునే వరకు వారు ఈ కేసులో నిందితులుగా నమోదు కాలేదన్నారు. అయినా వారిపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి అడ్డుకోవడం నిబంధనలకు పూర్తిగా విరుద్ధమన్నారు. ఇప్పటికే చెవిరెడ్డి పలుమార్లు ప్రకటించినట్లు తాను ఎప్పుడైనా విచారణకు సిద్ధమని, చిన్న ఉద్యోగులను ఇబ్బంది పెట్టకండని, తాను పారిపోవడం లేదని మీడియా ద్వారా స్పష్టం చేశారన్నారు. అయినప్పటికీ సిట్ రహస్యంగా చర్యలు చేపట్టి లుక్ అవుట్ నోటీసులతో అరెస్ట్ చేయడం నిందనీయమన్నారు. ఇది చంద్రబాబు సర్కార్ బరితెగింపు పాలనకుప్రజాస్వామ్య పరిరక్షణపై జరిపే పోరాటాలను అణిచివేయాలన్న కుట్రకు నిదర్శనంగా నిలుస్తోందని కృష్ణదాస్ ఆ ప్రకటనలో విమర్శించారు.

# ప్రజాసేవే పరమావధి గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజాసేవే పరమావధిగా ఎమ్మెల్యే గొండు శంకర్ నిలుస్తారని శ్రీకాకుళం నగర బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి అన్నారు. బుధవారం గొండు శంకర్ జన్మదినం సందర్భంగా శ్రీకాకుళం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు అందరూ కలిసి ఘనంగా ఆయన జన్మదినాన సేవా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీకాకుళం నగర బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి ఆధ్వర్యంలో గొలివి దామోదర్, ప్రియా చిట్టిబాబు, దాస్యం నాని, గంగు పెద్ద రమణ, ఉంగటి పాపారావు ఆధ్వర్యంలో నిన్న సాయంకాలం నుండి అన్నదాన కార్యక్రమాలు శ్రీకాకుళంలో ఉన్న అనాధ శరణాలయాలలో అనాథ పిల్లలు, వృద్దులు మధ్యన గొండు శంకర్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పట్టణ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, అంబటి లక్ష్మీరాజ్యం, ముఖ్య అతిథి రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు జగన్మోహన్‌రావు చేతుల మీదుగా కేకులను కట్ చేసి, పిల్లలకు, వృద్దులకు అన్నప్రసాదాన్ని అందించారు. దైవసమానులైన ఈ బిడ్డలకు అన్నదాన చేయడం మాకు భగవంతుడు కల్పించిన అవకాశమని, ఆ దేవదేవుడికి రుణపడి ఉంటామని, మిత్రబృందం అంతాకలసి ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, తాను ఏ కార్యక్రమం చేసినా, అండగా నిలుస్తున్న తన మిత్ర బృందం సహాయం మరువలేనిదని ఉంగటి రమణమూర్తి అన్నారు. ఎమ్మెల్యే శంకర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ మూర్తి. దేవస్థానంలో శాసనసభ్యులు, వారి కుటుంబ సభ్యుల పేరుమీద గోత్రనామాలతో, వేద పండితులు ఆశీర్వచనంతో శంకర్‌కు దేవాదాయ శాఖ ఈవో ప్రసాదాలను అందించారన్నారు. అలాగే తన కుమారుడు ఉంగటి నారాయణ సాయి జన్మదినం కూడా ఈరోజు కావడంతో శాసనసభ్యులు గొండు శంకర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో మిఠాయిలను తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా గొండు శంకర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ, కార్యక్రమాల్ని, నగర బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి గోడపత్రికల రూపాన చేసిన పత్రికను గొండు శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మిత్రబృందం ఘనంగా ఎమ్మెల్యేకు, నాయకులు, కార్యకర్తలు నడుమ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉంగటి పాపారావు, గొలివి దాము, దాస్యం నాని, గంగురమణ, తెలుగు నాగరత్నం, ఉంగటి రామ్మోహన్, రాయిపిల్లి అర్జున్, దండాసి జ్యోతి భాస్కర్, వ్యాపార శ్రీనివాస్, పి.కవిత, గొలివి భాస్కర్, సిమ్మ ప్రకాష్, వి.పెద్దరమణమూర్తి, మురళి తదితరులు పాల్గొన్నారు.

## యోగా చైతన్యం ప్రపంచానికి చాటుదాం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



యోగాంధ్రా కార్యక్రమం రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచింది. ఈ స్ఫూర్తితో యోగా ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పే అరుదైన అవకాశం మనకొచ్చిందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం 80 అడుగుల రోడ్డు కూడలిలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగాంధ్రా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన యోగాసనాల అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించారు. చారిత్రక ప్రదేశాల్లో నిర్వహించిన యోగాంధ్రా కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రత్యేక దృష్టి సారించారని, ఆయుష్ విభాగం, యోగా గురువులు, శిక్షకులు, సాధకుల సహకారంతో ప్రతి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల రోజుల పాటు ప్రజల భాగస్వామ్యంతో శ్రీకాకుళంలో యోగాంధ్రా ఉత్సవాల్లా సాగుతోందని తెలిపారు. ఈ నెల 21న విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొననున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా పట్ల విశేష ప్రాధాన్యం ఇస్తున్నారని గుర్తుచేశారు. మన శరీరం, మనసుపై నియంత్రణకు యోగా ఎంతో ఉపయోగకరమైన సాధనమన్నారు. ఇది భారతీయ జీవన విధానంలో భాగమైపోయింది. ఒత్తిడిని జయించాలంటే యోగా తప్పనిసరని శంకర్ తెలిపారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ సహా అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజలకు అపారమైన నమ్మకముందన్నారు. యోగాంధ్రా వేడుకలతో విశాఖలో సరికొత్త చరిత్ర లిఖించబోతోందని, అందులో భాగంగా శ్రీకాకుళం నుంచి పెద్ద సంఖ్యలో సాధకులు, ప్రజలు పాల్గొని జిల్లా సత్తా చాటాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ జన్మదినం కావడంతో శుభాకాంక్షలతో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.




బాపు గారి దర్శకత్వంలో ఎన్టీఆర్ గారి శ్రీనాథకవిసార్వభౌమ సినిమా షూటింగ్ రామకృష్ణ స్టూడియోలో జరుగుతున్న రోజులు.. తండ్రి సినిమా అందునా పౌరాణికం కావడంతో ఆసక్తిగా షూటింగ్‌కి వీలున్నప్పుడల్లా వచ్చేవాడు బాలయ్య... అదే స్టూడియోలో ఇంకో సెట్లో ఇంద్రజ హీరోయిన్‌గా పరిచయమయిన జంతర్ మంతర్ షూటింగ్ కూడా జరుగుతుంది.. ఒకరోజు సాయంత్రం తండ్రి సినిమా షూటింగ్ చూడడానికొచ్చిన బాలయ్యకి జంతర్ మంతర్ షూటింగ్ జరుగుతున్న సెట్ పక్కగా వెళ్తుండగా ఒక చిన్నకుర్రోడు లైట్ పట్టుకుని కనిపించాడు, ఎంతసేప ట్నుంచి పట్టుకుని ఉన్నాడో దాని బరువుమోయలేకనో అలసిపోయి కళ్ళుతిరిగిపడిపోయేలా కనిపించాడు..షాట్ మధ్యలో ఉంది.. వెంటనే బాలయ్య వేగంగా వెళ్ళి పడిపోబోతున్న కుర్రోడిని పక్కకి జరిపి షాట్ పూర్తయ్యేదాకా బాలయ్యే లైట్ పట్టుకున్నాడు..ఇది గమనించిన డైరెక్టర్ భరత్ పరిగెత్తుకుంటూ వచ్చి లైట్ చేతుల్లోకి తీసుకున్నాడు, షాట్ పూర్తవ్వగానే ఆగ్రహంతో బాలయ్య డైరెక్టర్ ని "పసిపిల్లలతో ఏంట్రా ఇది.. రీల్ తగలబెట్టేస్తా" అని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాడు...

# పసిపిల్లలతో ఏంట్రా ఇదీ..
# రీల్ తగలబెట్టేస్తా!!

మామూలుగానే బక్క చిక్కి ఉన్న ఆ పిల్లాడు, పొద్దున్నుంచి ఏమి తినకపోవడంతో నీరసంగా కనిపించాడు, ఆ పిల్లాడిని తీసుకెళ్ళి కడుపునిండా అన్నంపెట్టి వాళ్ళ తల్లితండ్రుల్ని తీసుకుని రమ్మని స్టూడియో సిబ్బందితో చెప్పాడు...

ఒక అరగంటలో ఆ కుర్రోడితో స్టూడియో మేనేజర్ తిరిగివచ్చాడు, పక్షవాతంతో తండ్రి, మూర్ఛరోగంతో తల్లి మంచానపడ్డారని తెలుసుకుని బాలయ్య చలించిపోయాడు, వెంటనే తార్నాకలోని హాస్పిటల్లో చేర్పించమని వాళ్ళ వైద్యానికి అయ్యే ఖర్చు అంత తానే భరిస్తానని చెప్పి, ఆ కుర్రోడిని తార్నాకలోని సరస్వతి శిశుమందిర్ లో చేర్పించి చదువు పూర్తయ్యేదాకా ఖర్చులన్నీ తానే భరించాడు...

కష్టపడి చదువుకున్న ఆ కుర్రోడు ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ లోని బంకురా జిల్లాలో సీఐ గా పనిచేస్తున్నాడు, ఇప్పటికీ జూన్ 10 వ తారీకు ఈ భూమిమీద ఎక్కడున్నా దగ్గర్లోని హాస్పిటల్ కి వెళ్ళి రక్తదానం చేస్తుంటాడు...

బాలయ్య గురించి ఇవేవీ రాయరు... ఎందుకంటే ఇవేవీ బాలయ్య ప్రచారంకోసం బాకా కొట్టుకోడు, ఎక్కడా చెప్పుకోడు, పబ్లిసిటీ పిచ్చి లేని పవర్ ఫుల్ మాన్, తనకి తెలిసిన సూత్రం ఒక్కటే గురూజీ "మానవసేవే మాధవ సేవ"

టాప్ హీరో సిని

మా టైం లో కూడా ఇలాంటి ఒక సంఘటన జరిగింది గురూజీ, మొత్తం సినిమా షూటింగ్ కంప్లీట్ అయ్యింది గుమ్మడి కాయ కొట్టేశారు, ఆ సినిమాలో చేసిన జూనియర్ ఆర్టిస్టులందరికీ పట్టు బట్టలు పంపించారు బాలకృష్ణ గారు, "దేవుడికి పట్టు వస్త్రాలు సమర్పించినట్టు, పేద కళాకారులకు పట్టు బట్టలు ఇవ్వడం గొప్ప శుభ పరిణామం" అని ఒక జర్నలిస్టు ఆ ఘటనను తనదైన శైలిలో సితార పత్రికలో రాశారు...

బాలయ్యకు కల్మషం ఉండదు, మనసులో ఒకటి బయటొకటి అనే మాటే లేదు, బోళా మనిషి, నిజాయితీకి నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం, ముక్కు సూటి మనిషి, తనకు తప్పు అనిపిస్తే స్పాట్ జడ్జిమెంట్ ఉంటుంది, బాలయ్యంటే బాలయ్యే మరోమాట లేదు, మనిషేమో అగ్నిపర్వతం మనసేమో మంచు పర్వతం, అభిమానుల ముద్దుల బాలయ్య, బంగారుకొండ మా బాలయ్య బాబు...

**నటసింహం నందమూరి బాలకృష్ణ గారికి బిలేటెడ్‌గా జన్మదిన శుభాకాంక్షలు..**

- జై బాలయ్య

## ఇషాగుప్తా బికినీ బీచ్‌లుక్

బాలీవుడ్ అందాల భామ ఇషా గుప్తా బాలీవుడ్ అందాల భామ ఇషా గుప్తా వరుసగా సీక్వెల్ మూవీల్లో నటిస్తూ బిజీగా ఉంది. మర్డర్ 4, వెల్ కం 3, హేరా ఫేరి 3 లాంటి క్రేజీ సీక్వెల్స్ లో నటిస్తోంది. వీటితో పాటు "దేశీ మ్యాజిక్" అనే మరో ఇంట్రెస్టింగ్ రొమాంటిక్ మూవీకి సంతకం చేసింది. ఇటీవల గ్యాప్ ని ఫిల్ చేస్తూ, ఈ భామ భారీ పునరాగమనానికి సిద్ధమవుతోంది. ఇంతలోనే బికినీ బీచ్ లో ఇషాజీ అగ్గి రాజేసింది. తాజాగా షేర్ చేసిన ఫోటోగ్రాఫ్ లో టోన్డ్ బాడీని ప్రెజెంట్ చేసింది ఇషా. ఫ్లోరల్ డిజైన్ స్విమ్‌సూట్ లో ఇషా టూ హాలి గా కనిపిస్తోంది. తన సోగ కళ్లకు అందమైన గాగుల్స్ ని కూడా ధరించింది. నేపథ్యంలో దూరంగా బులుగు సముద్రం, అందులో బోటింగ్ కూడా హైలైట్ గా కనిపిస్తోంది. సముద్ర గాలుల్ని ఆస్వాధిస్తూ ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో పాల్గొంది టాప్ మోడల్ కం నటి ఇషా. ఇక ఇదే బీచ్ వెకేషన్ లో ఇషా ఇంతకుముందు బ్లాక్ కలర్ డిజైనర్ బికినీలోను దర్శనమిచ్చింది. ఒక ప్రశాంతమైన క్షణం ఈషా పడవ డెక్‌పై విశ్రాంతి తీసుకుంటూ బికినీలో ఫోజులిచ్చిన ఫోటోలు వైరల్ అయ్యాయి. ప్రస్తుతం ఇషాజీ ఫోటోషూట్ ఇంటర్నెట్ ని మరిగిస్తోంది. వరుస చిత్రాలతో దూకుడు పెంచేస్తున్న ఈ భామ, కొంత గ్యాప్ తర్వాత గ్రేట్ కంబ్యాక్ ని ఆశిస్తోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



## రాజా సాబ్' మూడున్నర గంటలా?




రాజాసాబ్ టీజర్ వచ్చింది. ప్రభాస్ ఫ్యాన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యింది. ప్రభాస్ చూడ్డానికి బాగున్నాడు. విజువల్స్ కూడా అదిరాయి. ఈ టీజర్‌తో ఈ సినిమాపై నమ్మకాలు, అంచనాలు రెట్టింపు అయ్యాయి. ఈ టీజర్ వేడుకలో రాజాసాబ్ లెంగ్త్ గురించి దర్శకుడు మారుతి నోరు జారాడు. 'సినిమా మూడున్నర గంటలు' అంటూ చెప్పేశాడు. ఆ తరవాత.. 'మూడు గంటలే' అని సర్దాడు. ఈ సినిమాకు సంబంధించి చాలా కంటెంట్ తీశాడు మారుతి. ఇప్పటికే మూడు గంటల సినిమా తయారైంది. తీయాల్సిన సీన్లు కొన్ని ఉన్నాయి. పాటలు బాలెన్స్. అవన్నీ కలిపితే మూడున్నర గంటలు గ్యారెంటీ. దాన్ని ఎంత ట్రిమ్ చేసినా మూడు గంటల లెక్క తేలుతుంది. ఓ దశలో ఫుటేజ్ చూసిన నిర్మాత ఈ సినిమాని రెండు భాగాలుగా మారిస్తే ఎలా ఉంటుంది? అనే ఐడియా ఇచ్చార్ట. కానీ మారుతి ఒప్పుకోలేదు. ఎందుకంటే రాజాసాబ్–2కి సంబంధించిన ఐడియా మారుతి దగ్గర రెడీగా వుంది. పార్ట్–2కి చాలా డిఫరెంట్ గా ట్రై చేయబోతున్నాడని తెలుస్తోంది. అందుకే మారుతి ఒప్పుకోలేదు. ఒక్కటి మాత్రం నిజం. లెంగ్త్ పరంగా రాజాసాబ్ పెద్దదే. పార్ట్ 2 కూడా ఉంటుంది. పార్ట్ 2 హాలీవుడ్ రేంజ్‌లో తీస్తామని ఇప్పటికే నిర్మాత విశ్వ ప్రసాద్ ప్రకటించేశారు.

- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..



# పునాది వేశా..
# ప్రగతి సౌధాలు నిర్మిస్తా!

- తొలి ఏడాది పనితీరుపై గొండు శంకర్ వివరణ
- కార్పొరేషన్ ఎన్నికల నిర్వహణ రాష్ట్రస్థాయి అంశం
- సీఎం మార్గదర్శనం ప్రకారమే నిత్యం ప్రజాక్షేత్రంలో
- జిల్లా గ్రంథాలయ స్థలం అమ్మేస్తున్నారన్నది తప్పుడు ప్రచారం
- విలీన పంచాయతీల్లోనూ ముమ్మరంగా అభివృద్ధి పనులు

**తొలి ఏడాది పనితీరుపై ఎమ్మెల్యే గొండు శంకర్‌తో సత్యం ప్రత్యేక ఇంటర్వ్యూ..**

ఎటువంటి అంచనాల్లేకుండా.. సొంత పార్టీ క్యాడర్ వెంట లేకపోయినా.. కేవలం అధిష్ఠానం అనుగ్రహంతో ఆయన టికెట్ దొరకబుచ్చుకున్నారు. గెలుపే కనాకష్టం అనుకుంటే శ్రీకాకుళం నియోజకవర్గ చరిత్రలోనే రికార్డు మెజారిటీతో గెలిచి అసెంబ్లీ మెట్లెక్కారు. ఎమ్మెల్యేగా గొండు శంకర్ తొలి ఏడాది పూర్తి చేసుకున్నారు. తన పుట్టినరోజును, ఎమ్మెల్యేగా మొదటి వార్షికోత్సవాన్ని పూర్తి చేసుకుంటున్న ఆయన ఈ ఏడాది కాలంలో శ్రీకాకుళంలో దాదాపు స్తంభించిపోయిన అభివృద్ధికి మళ్లీ పునాదులు వేయగలిగానని చెప్పుకొచ్చారు. ఆ పునాదులపై ప్రగతి సౌధాలు నిర్మించడమే వచ్చే నాలుగేళ్లలో తన కర్తవ్యమని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో చాలావరకు ఆచరణలో పెట్టగలిగానని, వాటిని పూర్తి చేస్తానన్న తన హామీకి బద్ధుడనై ఉన్నానని స్పష్టం చేశారు. రానున్న నాలుగేళ్లలో నగర ప్రగతికి తన మదిలో ఉన్న ప్రణాళికలను 'సత్యం'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో శంకర్ సవివరంగా ప్రస్తావించారు.

**సత్యం: ఎమ్మెల్యేగా గత ఏడాది మీరు రోజుల పిల్లాడు. ఇప్పుడు ఎమ్మెల్యేగా మొదటి పుట్టిన రోజు జరుపుకొంటున్నారు. ఈ జర్నీ ఎలా ఉంది?**

**ఎమ్మెల్యే శంకర్:** బర్త్‌డే అంటూ ప్రత్యేకంగా జరుపుకోవడం నాకు ఇష్టం ఉండదు. కానీ గత మూడేళ్లుగా అలా జరిగిపోతోంది. ఇక ఈ ఏడాది జర్నీ అంటారా.. సంతోషంగానే ఉంది. ఇంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రభుత్వం అభివృద్ధి కోసం నిధులు కేటాయించడం, ఆ మేరకు నా నియోజకవర్గంలో పనులు జరుగుతుండటం ఆనందమే కదా!. ఇప్పటి వరకు భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పనులకు సంబంధించిన పునాది వేయగలిగాను. ఇక దాని మీద పూర్తిస్థాయి నిర్మాణాలే చేపట్టాలి. మున్సిపాలిటీ ఏర్పడి వందేళ్లు దాటినా ఇంకా మౌలిక వసతుల కల్పనలో థర్డ్‌గ్రేడ్‌గానే ఉంది. ఇప్పుడిప్పుడే కాలువలు, రోడ్లు, సుందరీకరణ వైపు దృష్టి సారించాం. ఆ మేరకు పనులు చేపడుతున్నాం. కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణ పనులు అనుకున్నట్టే ప్రారంభించాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్ ద్వారా రెండు అంతస్తులు నిర్మించాం. ఈలోగానే సంబంధిత కాంట్రాక్టరు సింహాచలంలో చందనోత్సవం సందర్భంగా నిర్మించిన గోడ కూలిన కేసులో చిక్కుకుపోయారు. దీంతో స్టేడియం పనులు నిలిచిపోయాయి. అలాగే గత ప్రభుత్వం కొంతమేర జరిగిన పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. నియోజకవర్గంలో శివారు భూములకు నీరందించే పనిని వేగవంతం చేశాం.

**సత్యం: శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు గత ప్రభుత్వంలో పూర్తి చేయలేదని, మీరు అధికారంలోకి వస్తే వంద రోజుల్లో రోడ్డును అందుబాటులోకి తెస్తామని చెప్పిన మీరు ఆ మేరకు పనులు జరగకపోతే మీ సొంత సొమ్ములు తీసి కోటి పైచిలుకు విలువైన బీటీని కాంట్రాక్టర్‌కు ఇచ్చారు.**

**అలాగే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కూడా ఇటువంటి సాయమే చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వంతో దాదాపు యుద్ధమే చేశారు. ఇప్పుడు ఆ రోడ్డు పనుల తీరుపై మీరు సంతృప్తిగా ఉన్నారా?**

**ఎమ్మెల్యే శంకర్:** ఈ పనుల మీద నేను చాలా అసంతృప్తిగా ఉన్నాను. చాలా బాధపడుతున్నాను. సంబంధిత కాంట్రాక్టర్ ప్రోపర్‌గా రెస్పాండ్ అవ్వడంలేదు. దీనిపై ఎస్పీకి ఫిర్యాదు చేసి, కేసు పెట్టడానికి కూడా వెనుకాడను. అందులో ఎటువంటి మొహమాటం లేదు. ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్తాను. ఎందుకంటే.. ముఖ్యమంత్రి జరిపిన సమీక్షలో కాంట్రాక్టరే రూ.10.50 కోట్లు బిల్లులు చెల్లిస్తే, మళ్లీ ఈ ప్రాజెక్టు పూర్తయ్యే వరకు పనులు ఆపనని స్వయంగా మాటిచ్చారు. అలాగే రోడ్డు పూర్తవడానికి టెక్నికల్‌గా రెండు ఇబ్బందులు ఉన్నాయి. అలాగని మిగిలిన పనుల పూర్తికి, దీనికి సంబంధం లేదు. ఇక శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఉన్న రోడ్డు వెడల్పునకు మాస్టర్ ప్లాన్ అడ్డంకిగా ఉంది. బలగ ప్రాంతంలో 60 అడుగులకు మాత్రమే మాస్టర్‌ప్లాన్‌లో అనుమతి ఉంది. కానీ ఈ రోడ్డు 80 అడుగుల వెడల్పునకు ప్రతిపాదించాం. ఇప్పుడు కొత్త మాస్టర్‌ప్లాన్ ఆమోదం పొందితే రోడ్డు వెడల్పు సులువవుతుంది. అప్పుడు మాత్రమే స్థలం, భవనాలు కోల్పోయినవారికి టీడీఆర్‌లు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో రోడ్డుకు అవసరమైన మేరకు ప్రహరీలు తొలగించాం. ఆ ప్రాంతంలో రోడ్డు వేయడానికి ఎటువంటి ఇబ్బందులు లేవు. కానీ కాంట్రాక్టర్ స్పందించడంలేదు. ఇంత క్లిష్ట పరిస్థితుల్లో కూడా కాంట్రాక్టర్‌కు రూ.16 కోట్ల బిల్లులు చెల్లించాం. ఆ తర్వాత రూ.8 కోట్ల వరకు ఆయన పనులు చేసి ఉండొచ్చు. ఆ బిల్లులు కూడా త్వరగానే చెల్లిస్తాం. కల్వర్టు పనులు పూర్తి చేయకపోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీని మీద నేను అభ్యంతరం చెబితే మొన్నే ఒక కల్వర్టుకు స్లాబ్ పూర్తిచేశారు. త్వరలోనే రెండో కల్వర్టు పనులు చేపడతారని భావిస్తున్నాను. మొత్తానికి అసంతృప్తిగానే ఉన్నాను.

**సత్యం: ఎమ్మెల్యే అయి ఏడాది దాటిపోయినా ఇంకా మీరే కార్యకర్త పని, కమిషనర్ పని, ఎంపీడీవో పని చేస్తుండటం వల్ల ఎమ్మెల్యే ప్రోటోకాల్ అనేది దక్కుతుందనుకుంటున్నారా?**

**ఎమ్మెల్యే శంకర్:** నేను ఎమ్మెల్యేగానే వ్యవహరిస్తున్నాను. ఒక వార్డు మెంబర్ ఎలాగో, కార్పొరేటర్ ఎలాగో అసెంబ్లీలో నేనొక మెంబర్ని. అంతేగానీ లీడర్‌ను కాను. అంటే అందరూ సేవకులమే. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థలకు ఏకపక్షంగా ఎన్నికలు నిర్వహించడం వల్ల అక్కడ మా ప్రతినిధులు లేరు. ఎంపీపీలు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు వైకాపావారే ఇప్పటికీ ఉండటం వల్ల మా పథకాల అమలులో వివక్ష ఎదురవుతోంది. అందుకే అన్నింటినీ స్వయంగా పర్యవేక్షించాల్సి వస్తోంది. ఉదాహరణకు చెప్పాలంటే జిల్లాపరిషత్ కార్యాలయం నుంచి కునుకుపేట వరకు అమ్మవారి పండగలు జరిగినప్పుడు ఎలక్ట్రిఫికేషన్ పనులు చేయించాం. కార్పొరేషన్‌లో పాలకవర్గం లేకపోవడం వల్ల నేనే చూసుకున్నాను. ఇది పండగల సందర్భంగా చేసినా, ఆ ప్రాంతానికి విద్యుత్ తీగలు, స్తంభాలకు సంబంధించి శాశ్వత పరిష్కారం దొరికింది. మా నాయకుడు చంద్రబాబు కూడా క్షేత్రస్థాయిలో ఉండమనే చెబుతున్నారు. నేనిలా జనం మధ్య ఉంటున్నానంటే ముఖ్యమంత్రి ఆదేశమనే భావించాలి.

**సత్యం: రోజుకు 15 నుంచి 18 గంటలు జనం మధ్యనే ఉంటున్న మీరు ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఓడిపోతారని ఒక సెఫాలజీ సంస్థ ప్రకటించింది. రాష్ట్రంలో 57 మంది ఈ జాబితాలో ఉంటే.. మీరు కూడా ఉన్నారని చెబుతోంది. దీన్ని మీరు ఎలా తీసుకుంటారు?**

**ఎమ్మెల్యే శంకర్:** వారు ఏ ప్రాతిపదికన ఈ అంచనా వేశారో నాకు తెలియదు. ఎక్కడ సర్వే చేశారో తెలియదు. గతంలో కూడా ఇదే వ్యక్తులు నాకు ఎమ్మెల్యే సీటు రాదని ప్రకటించారు. వచ్చిన తర్వాత గెలవనని సర్వే పేరుతో ప్రకటించారు. కానీ ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఇంతకు మించి దీని మీద వ్యాఖ్యానించను.

**సత్యం: ఎమ్మెల్యే అయిన వెంటనే శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిపిస్తానని వాగ్దానం చేశారు. ఏడాది పూర్తయినా ఇప్పుడా ఊసు లేదు. దీని ప్రభావం మీ మీద ఉండదా?**

**ఎమ్మెల్యే శంకర్:** ఎన్నికైన ఏడాదిలోనే కార్పొరేషన్ ఎన్నికలు పెట్టిస్తానని మాటిచ్చాను. ఆ మేరకు సిన్సియర్‌గా ప్రయత్నించాను. రాష్ట్రంలో 22 మున్సిపాల్టీల ఎన్నికలకు సంబంధించి చిక్కులున్నాయి. మన జిల్లాలో శ్రీకాకుళం నగరంతో పాటు ఆమదాలవలస కూడా ఉంది. వీటన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. నేను ఫిబ్రవరిలో ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయని ప్రకటించి నప్పుడు అది అంత సులువు కాదని 'సత్యం' పత్రికలో వచ్చిన కథనం చదివిన తర్వాతే అసలు విషయం నాకు బోధపడింది. ఇప్పటికి కూడా కార్పొరేషన్‌కు ఎన్నికలు జరిపి సమర్థులైన ప్రజాప్రతినిధులు వస్తే నా పని మరింత సులువవుతుంది. అలా జరగాలనే కోరుకుంటు న్నాను. విలీనమైన ఏడు పంచాయతీల్లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉన్న తోటపాలెం, కుశాలపురం పంచాయతీలను దీని నుంచి వేరు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. కొద్ది రోజుల్లో కేబినెట్ అప్రూవల్ కూడా వస్తుంది. మిగిలిన పంచాయతీ లతో మళ్లీ డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తిచేసి ఎన్నికలకు వెళ్లాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఏ డేటా అడిగినా ఇవ్వడానికి అన్నీ సిద్ధం చేసుకున్నాం. దీనిపై జూన్‌లో ప్రభుత్వం నుంచి ఓ స్టేట్‌మెంట్ వస్తుందని భావించాం. కానీ మొదటి ఏడాది ప్రభుత్వం పూర్తిగా అమరావతి పునర్నిర్మాణం మీదే దృష్టి పెట్టింది. అక్కడ యుద్ధప్రాతిపదికన రాజధాని పనులు జరుగు తున్నాయి. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా వాటి పర్యవేక్షణలోనే ఉన్నారు. అలాగే పోలవరం పూర్తిచేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. అందుకే ఎన్నికలు ఆలస్యమవుతున్నాయని భావిస్తున్నాను.

**సత్యం: శ్రీకాకుళం కార్పొరేషన్‌లో పంచాయతీలు విలీనం కావడం వల్ల ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేయడం కుదరడంలేదని, దీని వల్ల అభివృద్ధి ఆగిపోతుందని స్వయంగా మీ పార్టీ నేతలే చెబుతున్నారు. మీరేమో వీటి విలీనంతో కార్పొరేషన్ ఎన్నికలకు వెళ్తామంటున్నారు. ఈ జోడుగుర్రాల స్వారీ ఎలా కుదురుతుంది?**

**ఎమ్మెల్యే శంకర్:** నష్టపోవడం కాదు.. ఆల్రెడీ నష్టపోయాం. ఈ పంచాయతీల నుంచే కార్పొరేషన్‌కు ఎక్కువ ఆదాయం వస్తుంది. అందుకే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను అనేకసార్లు కలిసి వీటికి మినహాయింపు ఇవ్వాలని కోరాను. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకువెళ్లాను. కార్పొరేషన్ ఎన్నికలు జరగకపోయినా విలీనం అనే ఒక్క మాట వల్ల పంచాయతీలు నష్టపోతున్నాయని చెప్పాను. ఏది ఏమైనా ఈ నష్టాన్ని పూడ్చాల్సింది నేనే. అందుకే పాత్రునివలసలో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నాం. కిల్లిపాలెంలో వ్యవసాయ కాలువల్లో పూడికలు తీయిస్తున్నాం. ఇంక మిగిలిన పంచాయతీల్లో కూడా పనులు చేయాల్సి ఉంది. కనీసం ఎన్నికలు జరిగేవరకైనా ఎన్ఆర్ఈజీఎస్‌తో టైఅప్ ఉండాలన్నదే నా భావన. గత ప్రభుత్వం విలీనంపై ఆర్డినెన్స్ తీసుకురావడం వల్ల ఈ పంచాయతీలు ఎటూ చెందకుండాపోయాయి. ఇక్కడ పని చేస్తున్న సిబ్బందికి జీతాలు ఒక శాఖ నుంచి వస్తే, అడ్మినిస్ట్రేషన్ మరో శాఖ చూస్తుంది. ఈమధ్యనే ఆ గందరగోళం నుంచి బయటకు తెచ్చి పూర్తిగా కార్పొరేషన్‌కు అప్పగించాం. ఎంత ప్రయత్నించినా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రావని తెలిసిన తర్వాత కార్పొరేషన్ నిధుల నుంచే వీటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నాం. లేదూ అంటే వీటిని మళ్లీ పంచాయతీలుగానే ఉంచేయాలి. కానీ ఇవన్నీ రెవెన్యూ జనరేట్ చేసే కాలనీలుగా మారిపోయినందున మున్సిపాలిటీకి ఆనుకొని ఉన్నందున అలా చేయలేం. చాపురం మొత్తం పర్యటించి ఎక్కడెక్కడ ఏయే పనులు చేపట్టాలో ప్రణాళిక సిద్ధం చేసుకున్నాం. పెద్దపాడులో రూ.22 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తు న్నాం. కిల్లిపాలెంలో కూడా పనులు గుర్తించాం. ఖాజీపేటలో పెద్దగా సమస్యలు లేవు. అరసవల్లి మీద దృష్టి పెట్టాం.

**సత్యం: పొట్టిశ్రీరాములు పెద్దమార్కెట్‌ను పి-3 మోడ్‌లో ఎప్పుడు పునర్నిర్మిస్తున్నారు?**

**ఎమ్మెల్యే శంకర్:** పి-3 మోడ్‌లో కాదు.. ప్రస్తుతం మార్కెట్‌లో భవనాలు 90 శాతం ఉపయోగపడటంలేదు. అంతా రోడ్డు మీదే వ్యాపారం చేస్తున్నారు. అలా కాకుండా అందరికీ ఉపయోగపడేలా ఒక డిజైన్ తయారుచేసి, దాన్ని మార్కెటింగ్ శాఖ పరిధిలోనే నిర్మించాలని మంత్రి అచ్చెన్నాయుడు భావించారు. ముందు దీని డిజైన్ ఖరారైతే ఆ తర్వాత శతశాతం నిధులు మంజూరైతేనే కొత్త మార్కెట్‌ను నిర్మిస్తాం. ప్రస్తుతానికి ఇందుకు సంబంధించి ఎటువంటి కొత్త అప్‌డేట్ లేదు.

**సత్యం: ఆర్ అండ్ బి బంగ్లాను పి-3 మోడ్‌లో అభివృద్ధి చేస్తున్నారట. నిజమేనా?**

**ఎమ్మెల్యే శంకర్:** నాకూ నిన్నటి వరకు తెలియదు. కానీ కలెక్టర్ మాత్రం ఈ ప్రాంతంలో పి-3 మోడ్‌లో రివర్ వ్యూ పాయింట్‌లో ఒక ఫోర్ స్టార్ హోటల్ నిర్మిస్తే బావుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. శ్రీకాకుళంలో కొన్ని త్రీస్టార్ హోటల్స్ ఉన్నందున ఫోర్ స్టార్, ఆ పైస్థాయిలో ఉన్న హోటలైతే బాగుంటుందని నా భావన. మూలపేట పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయితే స్టార్ హోటల్‌కు శ్రీకాకుళంలో నష్టం ఉండదనేదే నా ఆలోచన.

**సత్యం: జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఎప్పుడు అమ్మేస్తున్నారు? ఎవరికి అమ్మేస్తున్నారు?**

**ఎమ్మెల్యే శంకర్:** ఇది నూటికి నూరుశాతం అవాస్తవం. నేను కూడా నిన్ననే ఒక ఇంగ్లీష్ పేపర్‌లో ఈ వార్త చూశాను. నాకు తెలిసినంత వరకు గతంలో ఇక్కడ డిజిటల్ గ్రంథాలయం, డార్మిటరీతో పాటు మెడిటేషన్ హాల్‌తో కూడిన యువ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని భావించాం. కానీ ఆ స్థలం సరిపోదని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఉన్న హాస్టల్స్ ప్రాంతాన్ని చూశాం. అక్కడా కుదరకపోవడంతో ఈ ప్రాజెక్ట్ కాస్ట్ కూడా కాలగమనంలో రూ.10 కోట్ల అంచనాకు చేరిపోయింది. దీంతో యువ ప్రాజెక్ట్ పట్టాలెక్కకుండానే ఆగిపోయింది. అంతవరకే నాకు తెలుసు. కానీ గ్రంథాలయ పరిరక్షణ సమితి పేరుతో కొందరు ఈమధ్య ఇటువంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారు. గ్రంథాలయం ఎప్పట్నుంచో శిథిలావస్థకు చేరుకుంటున్నా గత ప్రభుత్వ హయాంలో ఈ పరిరక్షణ సమితి ఎటువంటి పోరాటాలు చేసిందో చెబితే బాగుంటుంది. గత ఐదేళ్లలో రూ.5 లక్షలు కూడా ప్రభుత్వం నుంచి రావాల్సిన సొమ్ములు రాబట్టలేకపోయినవారు ఇప్పుడు పరిరక్షణ పేరుతో తప్పుదోవ పట్టిస్తున్నారు. 2014-19 టీడీపీ హయాంలో రూ.5 కోట్ల ప్రభుత్వ నిధులతో యువ బిల్డింగ్ కడదామనుకున్నాం. టెండరింగ్ ప్రక్రియకొచ్చేసరికే ప్రభుత్వం మారిపోయింది. ఇప్పుడు అమ్మేస్తామనో, పి-3 మోడ్‌లో ఇచ్చేస్తామనో ప్రచారం చేస్తున్నారు. కార్గిల్ పార్క్‌ను సీఎస్ఆర్ యాక్టివిటీలో అభివృద్ధి చేస్తే అక్కడ కూడా ఓ ఆర్టిఫిషియల్ ఉద్యమాన్ని నడిపారు. ఇప్పుడు గ్రంథాలయం మీద దుష్ప్రచారం చేస్తున్నారు. ఎక్కడైనా దీన్ని పి-3 మోడ్‌లో ఇస్తున్నామని గాని, అమ్మేస్తున్నామని గాని రుజువు చేస్తే నా ముక్కు నేలకు రాస్తా. మరో నాలుగేళ్లు ఎమ్మెల్యేగా పని చేయాలి. ఆ తర్వాత కూడా ఇక్కడే ఉండాలి. తేడా వస్తే ప్రజలు పిలక తిప్పేస్తారు. ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకుంటే మంచిది. నేనే చెబుతున్నాను. మున్సిపల్ కార్యాలయమో, ఆర్టీసీ కాంప్లెక్సో పి-3 మోడ్‌లో ఇస్తే అభివృద్ధి జరుగుతుంది. కావాలంటే ఇటువంటి ప్రచారం చేస్తున్నవారు ముందుకొస్తే ఇచ్చేస్తాం. వారే దీన్ని అభివృద్ధి చేసుకోవచ్చు. వారు నాశనమైపోడానికే ఇటువంటి అసత్య ప్రచారాలు చేస్తున్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారు.

**సత్యం: పార్టీలతో ప్రమేయం లేకుండానే అందరూ ఓట్లేస్తే, మీకు రికార్డు మెజార్టీ వచ్చింది. అటువంటిది కొందరు మీ పార్టీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వెంట నడిస్తే మీరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారట. నిజమేనా?**

**ఎమ్మెల్యే శంకర్:** నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితం వారిది. పరామర్శలు, పలకరింపులకు వెళ్తే కాదనడానికి నేనెవర్ని? కానీ పార్టీ కార్యక్రమాలు చేపడితే చీలిక వస్తుందని మాత్రం చెప్పాను. ఆమె ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నేను కొన్ని గ్రామాల్లో పర్యటిస్తే టీడీపీ ఇన్‌ఛార్జిని కాదు కాబట్టి పార్టీ కార్యక్రమాలు చేపట్టొద్దంటూ దూరం పెట్టారు. టికెట్ వచ్చిన 20 రోజుల వరకు నాతో కలిసి నడవడానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు. ఆ తర్వాత అన్నీ సర్దుకున్నాయ్.. అందరూ మన స్ఫూర్తిగా పని చేశారు.. అక్కడక్కడ కొందరు మాత్రమే మిగిలిపోయారు. అప్పుడు నాకు వర్తించిన సూత్రమే ఇప్పుడు ఎవరికైనా వర్తిస్తుంది కదా.. అందుకే అటువంటి చర్యలకు పాల్పడినవారిని తప్పని చెప్పాను. అంతే తప్ప వ్యక్తిగత పరిచయాలపై కుటుంబ కార్యక్రమాల కోసం ఎవరు ఎవరితో వెళ్లినా నాకెందుకు అభ్యంతరం ఉంటుంది!

**- పూర్తి ఇంటర్వ్యూ కోసం**
**సత్యం టీవీ శ్రీకాకుళంను వీక్షించగలరు.కం**










BOOK NOW
మా ప్రత్యేకతలు
2వేల మంది ఒకేసారి భోజనం చేసేవిధంగా డైనింగ్ హాల్
అతి పెద్ద కల్యాణ వేదిక
అతి పెద్ద స్విమ్మింగ్ పూల్
బాక్స్ క్రికెట్
ఎగ్జిక్యూటివ్ అండ్ సూట్ రూమ్స్
హైజినిక్ కిచెన్
హైజినిక్ ఫుడ్ అవైలబుల్
అతి పెద్ద బ్లాంకెట్ హాల్
కిట్టీ, బర్త్‌డే పార్టీలకు ప్రత్యేకమైన సౌకర్యం
ప్రత్యేకమైన ప్రీమియం
మినీ థియేటర్
SERENE WOODS
శ్రీకాకుళం నగరానికి 5 కిలోమీటర్ల దూరంలో..
అధునాతన హంగులతో అందరికీ అందుబాటు ధరల్లో
SERENE WOODS
SERENE WOODS CONVENTIONS
ఉదయ్‌కిరణ్: 91009 34455, 91600 93335
కింతలిమిల్లు జంక్షన్ దగ్గర

## జనగణనతోపాటు కులగణన చేపట్టండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కుల గణనతప్పనిసరిగా చేపట్టాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు టి. తిరుపతిరావు కేంద్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం సోమవారం విలువరిం చిన గెజిట్ నోటిఫికేషన్‌లో కుల గణన చేస్తామని స్పష్టత లేకపో వడం, మోడీ ప్రభుత్వం యూ టర్న్ తీసుకున్నట్లా అని ప్రశ్నిం చారు. కులగణన చేయడం ద్వారా ప్రభుత్వానికి మరింత సామాజిక అంశాలలో జవాబుతనం ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం ఈ కార్యక్రమంకి సిద్ధ పడడం అభిందనీయమని తెలిపారు. 2020లో జరగాల్సిన ప్రక్రియను, కరోనా కారణంగా వాయిదా వేశారని గుర్తుచేశారు.కులగణన భాగంగానే ఆయా కులాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర అంశాలను పరిశీలన చేసి గణన చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో ఎక్కడా లేని కుల వ్యవ స్థ భారతదేశం లో ఉన్నది కాబట్టే కుల గణన చేయాల్సిన ఆవశ్య కత ఎంతైనా ఉందన్నారు. ప్రతి పదేళ్లకు జరగాల్సిన జన గణన, స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి 7సార్లు మాత్రమే చేశారని గుర్తుచేశా రు. కుల గణన జరిపిన బీహార్, తెలంగాణా రాష్ట్రాలలో జరిగిన తీరును అభిందించారు. ఏమైనా ప్రస్తుత ప్రక్రియ సంతోషదాయకమని అన్నారు.






## జిల్లా గ్రంథాలయానికి ఆధునిక రూపం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఆధునికంగా తీర్చి దిద్దేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను అందించనుందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్పష్టం చేశారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అభివృద్ధి ప్రణాళికకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన అభ్యర్థన మేరకు ఏఏఐ ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్రంలోనే ఒక ప్రముఖ మోడల్ గ్రంథాలయంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని జేసీ పేర్కొన్నారు. విద్యార్థులు, పాఠకులకు ఉపయోగపడే సౌకర్యాలతో ఇది స్టేట్ ఆఫ్ ఆర్ట్ గ్రంథాలయంగా అభివృద్ధి చేయబడుతుందని ఆయన వెల్లడించారు. ఈ నిధులను జిల్లా పాలనా యంత్రాంగమే వినియోగించనుందని, ఎలాంటి ప్రైవేటీకరణ అంశం ప్రస్తావనకే రాలేదని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రంథాలయం పూర్తి స్థాయిలో ప్రభుత్వ యాజమాన్యంలోనే ఉంటుందని, ఇప్పటికే ప్రజా ఆస్తిగా ఉన్న ఈ గ్రంథాలయం భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగుతుందన్నారు. గ్రంథాలయం ప్రైవేటీకరణ చేస్తారనే అసత్య ప్రచారాలు నమ్మవద్దని ఖాన్ తేల్చి చెప్పారు.



## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ జన్మదినోత్సవాన్ని పట్టణంలోని 9వ డివిజన్ ఇన్‌చార్జ్ బుర్రి మధు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షులు, స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్, దుంగ శ్రీధర్ ఎమ్మెల్యే శంకర్ బర్త్‌డే కేక్‌ను కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమంలో రెళ్ల గోపి, జగదీష్, ఈశ్వర్, బద్రి మోహన్, వంగ దివాకర్, కుర్మాన కుమార్, రాజా, శ్రీను,విజయ్ కుమార్, నాగేంద్ర, బాణాల వెంకటి, రమణారావు, తాళ్లవలస శ్రీను, నాగయ్య, దేవానంద్, కౌసల్య,, హరిత, నాగమణి, ప్రకాష్,రాజేష్, రత్నం,అలిగి రవి, నారాయణ రావు పాల్గొని గోండు శంకర్ గారికి జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు.



"యోగాంధ్ర" విజయవంతం కోసం తూర్పు నియోజకవర్గ వార్డు ఇన్‌చార్జితో విశాఖ తూర్పు నియోజకవర్గ జనసేన కో-ఆర్డినేటర్ కొరికాన రవికుమార్ బుధవారం సమావేశమయ్యారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21న విశాఖపట్నంలో ఘనంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ జయప్రదం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌మేళా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళంలో ఎంఎస్ఎన్ ల్యాబరేటరీ వారు బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 50మంది పాల్గొనగా 25మంది ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, డాక్టర్. వై.పోలినాయుడు తెలిపారు. ఎంపికయిన విద్యార్థులందరికీ నియామక పత్రాలను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జేకేసీ కో-ఆర్డినేటర్ వై.మణికుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ సత్యనారాయణ, అధ్యాపకులు శ్రీనివాస్‌పాత్రో, డాక్టర్ ఎ.సూరిబాబు, డాక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.





ఈనెల 21 న విశాఖపట్నంలో ప్రధాని మోడీ అధ్యక్షతన నిర్వహించబోయే యోగాంధ్రపై ఆమదాలవలస నియోజకవర్గ పరిధి బూర్జ ఎంపీడీఓ ఆఫీస్‌లో ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకులు పెడన ఎమ్మెల్యే కాగితపల్లి కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్‌తోపాటు మండల అధికారులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

## ప్రజాభిమానానికి "పాదాభివందనం"

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజాభిమానానికి పాదాభివందనమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. స్థానిక విశాఖ కాలనీలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయటానికి సుదూర ప్రాంతాలనుండి తరలివచ్చిన ప్రజలకు, అభిమానులకు, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు, డివిజన్ ఇన్‌చార్జ్‌లకు, తెలుగు మహిళా నాయకులకు, విద్యార్థి విభాగాలకు, కళాశాలలకు, పాఠశాలలకు, ప్రముఖవైద్యులకు, లాయర్లకు, జిల్లా అధికారులకు, వక్తలు, నగర ప్రముఖులకు, లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులకు, స్వచ్ఛంద సంస్థలకు, సభ్యుల బృందానికి, జనసేన, బీజేపీ నాయకులకు, స్థానికులకు, తదితరులకు పేరు పేరు నా కృతజ్ఞతలన్నారు. అలాగే జన్మదినం సందర్భంగా ఆర్భాటాలు, వేడుకలకు, బహుమతులకు తాను దూరమన్నారు. ఆశీర్వాదాలే పెద్ద బహుమతులన్నారు. ఇంతటి అభిమానాన్నిచూపిస్తున్న ప్రతీ ఒక్కరికీ రుణపడి ఉంటానని, ప్రతీ కార్యకర్తకు, ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజాసేవకై ముందుంటానని తెలిపారు. సుదీర్ఘ ప్రాంతాల నుండి వచ్చిన వారు, సురక్షితంగా ఇంటికి చేరుకొని సమాచారమందించాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం నగర తెలుగుదేశం పార్టీ, అభిమానులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్, కట్ చేసి పార్టీ కుటుంబసభ్యులకు తినిపించారు. అదే విధంగా పేదలకు చీరలు ఎమ్మెల్యే చేతుల మీదుగా నగర పార్టీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, శ్రీకాకుళం పార్లమెంట్ తెలుగుయువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, పార్లమెంట్ పార్టీ కోశాధికారి ఇప్పిలి తిరుమలరావు, వంశధార ప్రాజెక్ట్ చైర్మన్ అరవల రవీంద్ర, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్, నగర పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, ముఖ్య నాయకులు డివిజన్ ఇంచార్జులు, మహిళలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా నగరంలో, నియోజకవర్గంలో దేవాలయాలు, చర్చిలు, మసీదులలో పూజలు ప్రార్థనలు నిర్వహించారు. డివిజన్‌లలో ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు, కేక్ కట్ చేశారు. స్థానిక 13వ డివిజన్‌లో నగర తెలుగు యువత కార్యదర్శి జలగడుగుల జగన్ ఆధ్వర్యంలో యువత రక్తదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంకా ఈ పుట్టిన రోజు కార్యక్రమాలలో యావత్తు నియోజకవర్గం పార్టీ కుటుంబ సభ్యులు, కూటమి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యేకు పుస్తకాలు, పుష్ప మాలలు, శాలువాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు



## శ్రీ సత్యసాయి హైస్కూల్‌లో తల్లికి వందనం వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తల్లికి వందనం, విద్యార్థులకు, తల్లితండ్రులకు వరమని, శ్రీసత్యసాయి హైస్కూల్ డైరెక్టర్, టీడీపీ 32వ డివిజన్ ఇన్‌చార్జి పీవీఎస్ మధుసూదనరావు అన్నారు. ప్రతీ తల్లి సంతోషంగా ఉండాలని, కూటమి ప్రభుత్వం అమలు చేసిన తల్లికి వందనం మహోత్తర పథకమని తెలిపారు. బుధవారం శ్రీ సత్యసాయి హైస్కూల్‌లో తల్లికి వందనం వేడుకలు విద్యార్థినీ విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల డైరెక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో, విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుట్టారని, సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని, పాఠశాలలు, కళాశాలలు తెరిచిన నాటికే నగదుని జమచేశారన్నారు. అందుకు కృతజ్ఞతగా తమ పాఠశాల విద్యార్థులు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతాభావంతో జేజేలు పలికారన్నారు. శ్రీకాకుళం అభివృద్ధి ప్రదాత, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు. శంకర్ జన్మదినం సందర్భంగా, పాఠశాలలో విద్యార్థుల ఆనందహేల కేరింతలతో కేక్ కట్ చేసిననంతరం ఫలాలు, మిఠాయిలను పంచిపెట్టి వినూత్నంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారన్నారు. గొండు శంకర్ అనతి కాలంలోనే పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్నారంటే, దానివెనుక వర్ణించరాని కృషి ఎన్నో ఏళ్లుగా ఉందని, దాని మూలంగానే అత్యధిక మెజార్టీతో గెలుపొంది, శ్రీకాకుళం శాసన సభ్యులుగా నిలిచి, అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.



## గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కరించండి

(సత్యంన్యూస్, పలాస)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని వీఆర్ఏల సంఘం



ప్రతినిధులు డిమాండ్ చేశారు ఈ మేరకు ఈరోజు పలాస లో ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతి పత్రం అందజేశారు. వీఆర్ఏల సమస్యల కోసం శాసనసభలో మాట్లాడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న జీతాల విధానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రభుత్వ పరంగా కృషి చేయాలని కోరారు వీఆర్ఏలకు వీఆర్వోలుగా ప్రమోషన్లు ఇవ్వాలని అక్రమ డిప్యూటేషన్లను రద్దు చేయాలని తదితర సమస్యలపై వారు ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు వినతి పత్రం అందజేసిన వారిలో వీఆర్ఏల సంఘం నాయకులు పి శ్రీనివాసరావు, దేశీ సీతారాం, బాలకృష్ణారావు, గువ్వాడ లలిత, సంత్రాశి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ తగిన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ కు ఏపీయూడబ్ల్యూజే, స్నామ్నా జిల్లా నాయకత్వం అభ్యర్థించింది. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు యూనియన్ల నాయకత్వం బృందం వినతి పత్రం సమర్పించింది. వివిధ జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా ప్రైవేటు విద్యాసంస్థలకు తగిన ఆదేశాలు జారీ చేయించారని గుర్తుచేస్తూ, అయ్యా జిల్లాల కలెక్టర్లు ఇచ్చిన ఆదేశాల ప్రతులను వినతిపత్రంతో జత చేశారు. కలెక్టర్ దృష్టికి ఈ అంశాన్ని తీసుకువచ్చి, తప్పకుండా న్యాయం చేస్తానని డిఆర్ఓ వెంకటేశ్వర రావు హామీ ఇచ్చారు. ఆయనను కలిసిన వారిలో ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లి ధర్మారావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్ .ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు సిహెచ్ జగదీష్, స్నామ్నా జిల్లా అధ్యక్షుడు సున్నం చిన్నారావు, గరిమెళ్ళ ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఎస్. నవ చైతన్య, కోశాధికారి చౌదరి సత్యనారాయణ ఉన్నారు


'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221


## గాంధీ నేటి సమాజానికి మార్గ నిర్దేశకులు

(సత్యంన్యూస్, రాజాం)

భారత జాతిపిత గాంధీ నేటి సమాజానికి మార్గ నిర్దేశకులు అని ఆయన అడుగు జాడ లో ప్రతీ విద్యార్థి మెలగాలని రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. ఆయన బుధవారం వెలగవలస హైస్కూల్‌లో రాజాం గాంధీ స్మారకనిధి నుంచి కొత్తా అనంతరావు దంపతుల పేరుమీద ఇచ్చిన గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి నడవడిక అలవర్చుకునేందుకు అవకాశం కలుగుతుందని స్పష్టం చేశారు. అనునిత్యం పాఠశాలలో ఆవిష్కరించిన గాంధీజీ విగ్రహం నమస్కరించుకొని పాఠశాలలో అడుగుపెడితే విద్యార్థికి మంచి వాతావరణం అలవర్చుతుందని అన్నారు నాటి సమావేశంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు బంగారునాయుడు మాట్లాడుతూ గాంధీజీ కన్న కలలు సహకారం అవ్వాలంటే నేటి బాలులు రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. ఆయన తీసుకున్న మార్గం దేశానికి స్వాతంత్రానికి సుగుమ అయిందని శాంతి అనే ఏకైక మంత్రం తో తెల్లదొరలను పారద్రోలి జాతిపితగా పేరు గాంచారన్నారు. విగ్రహ దాత అలోచనను ప్రతి విద్యార్థి పాటించాలని కులమత భేదంలను విడనాడి, ఐకమత్యంతో కలిసి మెలసి మెలగాలన్నారు. ప్రతీ విద్యార్థి గాంధీ గూర్చి తెలుసుకొని ఆయన నడవడికను అలవర్చుకోవాలనుకున్నప్పుడే మంచి సమాజం నిర్మితమవుతుందన్నారు. ప్రధానంగా విగ్రహదాత మనుమరాలు తొండేల కోషిల జన్మదినోత్సవం సందర్భంగా విగ్రహావిష్కరణ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కేకు కటింగ్ చేసి విద్యార్థులకు మిఠాయిలు పంచారు. సమావేశంలో ఉపాధ్యాయులు తిరుపతిరావు, జెపిడి రాజు, చంద్రమౌళి, కవిత, రమణమాస్టారు, కో-కన్వీనర్ పెంకి చైతన్య కుమార్, నీలకంఠేశ్వర యాదవ్, కొల్లూరు తిరుమలేశ్వరరావులు పాల్గొన్నారు.




డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రో॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.